క్లుప్తంగా

స్తంభంపల్లిలో ఎడ్లబండి పోటీలు



విజేతలకు బహుమతి ప్రదానం

వెల్గటూర్: మండలంలోని స్తంభంపల్లి గ్రామంలో స్వయంభూగా వెలసిన శ్రీవేంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. ఈ బ్రహ్మోత్సవాల్లో భాగంగా మంగళవారం ఎండ్లబండ్ల పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో వివిధ గ్రామాలకు చెందిన 14 బండ్లు పాల్గొనగా పొన్నారం గ్రామానికి చెందిన పి.లక్ష్మణ్ మొదటి బహుమతిగా పావుతులం బంగారం, బూర్గుపల్లె గ్రామానికి చెందిన నాయిని రాజేందర్ రెండో బహుమతిగా 8 తులాల వెండి, తిర్మలాపూర్ గ్రామానికి చెందిన ఎస్.కె.యూసుఫ్ మూడో బహుమతిగా 4 తులాల వెండి గెలుచుకున్నారు. ఉత్సవ కమిటీ చైర్మన్ మార్గం సతీశ్, సర్పంచ్ రూపారాణి, ఎంపీటీసీ పొడేటి సత్తయ్య, ఏఎంసీ చైర్మన్ పత్తిపాక వెంకటేశ్, ఏఎంసీ వైస్ చైర్మన్ పొడేటి రవి, బీఆర్ఎస్ గ్రామశాఖ అధ్యక్షుడు తొగిటి ప్రభాకర్, ఉత్సవ కమిటీ సభ్యులు పాకాల నరేశ్, చింతల శివకుమార్, నాయకులు పాల్గొన్నారు.

విద్యార్థి దశ కీలకం



మాట్లాడుతున్న సీఐ లక్ష్మీనారాయణ

మెట్‌పల్లి: ప్రతి ఒక్కరి జీవితంలో విద్యార్థి దశ ఎంతో కీలకమైందని సీఐ లక్ష్మీనారాయణ అన్నారు. ఈ మేరకు పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మంగళవారం అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థి దశలో చెడు వ్యసనాల బారిన పడకుండా మంచి లక్ష్యాలతో ముందుకు సాగితే ఉజ్వలమైన భవిష్యత్ ఉంటుందన్నారు. పట్టుదల, ప్రణాళికాబద్ధంగా చదివితే ఏదైనా సాధించవచ్చన్నారు. అనంతరం సైబర్ క్రైమ్‌తో పాటు మత్తు పదార్థాలతో కలిగే అనర్థాల గురించి వివరించారు. ఎస్సై శ్యామ్‌రాజ్, పిల్లల వైద్య నిపుణులు గంగసాగర్, ప్రిన్సిపాల్ వెంకటేశ్వర్‌రావు పాల్గొన్నారు.

వైభవంగా మల్లన్న జాతర



ఊరేగింపులో పాల్గొన్న భక్తులు

కథలాపూర్: మండలంలోని భూషణరావుపేటలో మల్లికార్జునస్వామి (మల్లన్న) జాతర ఉత్సవాలు మంగళవారం ఘనంగా జరిగాయి. ఆలయంలో భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. జాతర సందర్భంగా నిర్వాహకులు మహా అన్నదానం నిర్వహించారు. సాయంత్రం స్వామివారిని పల్లకిలో ఊరేగించారు. ఉత్సవాల్లో నాయకులు, ఆచార సంఘం సభ్యులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం



రక్తదానం చేస్తున్న నాయకులు

మెట్‌పల్లి: పట్టణంలోని కాంగ్రెస్ కార్యాలయంలో మంగళవారం రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. నాయకులు కొమొరెడ్డి కరం జన్మదినోత్సవాన్ని పురస్కరించుకొని ఏర్పాటు చేసిన ఈ శిబిరంలో పలువురు కార్యకర్తలు పాల్గొని రక్తదానం చేశారు. నాయకులు ఎర్రోల హన్మండ్లు, యామ రాజయ్య, రైసుద్దీన్, సురభి అశోక్, రజాక్, పెంట ప్రణయ్, సమీర్, దీక్షిత్, అజర్, అజీమ్, సిద్దార్థ, పోచయ్య, సల్మాన్, బర్ల వంశీ, అర్జున్, హరికుమార్ పాల్గొన్నారు.

శ్రీలక్ష్మీనృసింహస్వామి కల్యాణోత్సవం



కల్యాణం నిర్వహిస్తున్న పురోహితులు

మెట్‌పల్లి: పట్టణంలోని బోయవాడలో గల శ్రీలక్ష్మీనృసింహస్వామి ఆలయంలో మంగళవారం స్వామివారి కల్యాణోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఉత్సవ విగ్రహాలను అలంకరించి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం కల్యాణం నిర్వహించారు. భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో అన్న ప్రసాదం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో అధ్యక్షుడు పరిమి నర్సయ్యతో పాటు సభ్యులు పాల్గొన్నారు.

విద్యుత్ సమస్యలతో రైతన్న ఆగమాగం

- కరెంట్ ఎప్పుడు వస్తుందో, ఎప్పుడు పోతుందో తెలియని పరిస్థితి
- వాట్సాప్ గ్రూప్ ద్వారా అన్నదాతకు విద్యుత్‌వేళల సమాచారం
- సారంగాపూర్, బీర్‌పూర్ మండలాల్లో 25వేల ఎకరాల్లో వరిసాగు
- నీరు అందక ఎండుతున్న పొలాలు

సారంగాపూర్: వ్యవసాయ రంగానికి విద్యుత్ సరఫరా రోజురోజుకూ క్లిష్టంగా మారుతోంది. గడిచిన 15 రోజుల నుంచి విద్యుత్ సరఫరా సమయాల్లో ఓ నిర్దిష్టత లేకపోవడంతో విద్యుత్ అధికారుల తీరును ఎండగడుతూనే, బావుల్లో పుష్కలంగా నీరు ఉన్నా, విద్యుత్ లేక పొలాలు ఎండిపోతున్నాయని రైతులు ఆవేదన చెందుతున్నారు. దివంగత సీఎం వైఎస్ రాజశేఖరరెడ్డి పాలన కంటే ముందు (2004కు ముందు) వ్యవసాయానికి ఎలా విద్యుత్ సరఫరా జరిగిందో ఇప్పుడు అదే పరిస్థితి నెలకొందని రైతులు తీవ్ర స్థాయిలో విమర్శలు చేస్తున్నారు.

25వేల ఎకరాల్లో వరిసాగు..

ప్రభుత్వం 24 గంటలు ఉచిత విద్యుత్ అని చెప్తున్నప్పటికీ త్రీఫేజ్ సరఫరాలో ఇది కాస్తయినా కనిపించడం లేదని రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తునారు. సారంగాపూర్, బీర్‌పూర్ రెండు మండలాల్లో 25వేల ఎకరాల్లో వరిసాగు చేశారు. 50శాతం పంటల వరకు ఎస్సారెస్పీ నీరు వస్తున్నా, ఇది ఆన్ అండ్ ఆఫ్ విధానంలో వారం రోజులు సాగునీరు వస్తుండగా, మరుసటి వారం



కలెక్టరేట్ ఎదుట నిరసన తెలుపుతున్న బీర్‌పూర్ మండలానికి చెందిన మహిపాల్‌రెడ్డి

ఎస్సారెస్పీ నీరు నిలిపివేస్తున్నారు. ఎస్సారెస్పీ నీరు రాని వారంరోజులు పొలాలకు తప్పనిసరిగా విద్యుత్ పంపుసెట్ల ద్వారా సాగునీరు అందించాలి. కానీ ప్రతిరోజూ కనీసం 10 గంటలు త్రీఫేజ్ సరఫరా ఇచ్చినా సరిపోతుందని, ఇప్పుడు 6, 7 గంటల సరఫరా కూడా ఉండడం లేదని, దీంతో పొలాలు ఎండుతున్నాయని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. విద్యుత్ రాత్రి, పగలు ఎప్పుడు వస్తుందో, ఎప్పుడు సరఫరా నిలిచిపోతుందో తెలియని పరిస్థితి నెలకొనడంతో రైతులు అసహనం వ్యక్తం చేస్తుండగా, ఇటీవల సారంగాపూర్ మండల సర్వసభ్య సమావేశంలో వ్యవసాయానికి త్రీఫేజ్ విద్యుత్ సరఫరా తీరుపై సభ్యులు ఎండగట్టారు. అధికారులు రెండు, మూడు రోజుల్లో సమస్య పరిష్కరిస్తామని చెప్పినా విద్యుత్ సరఫరాలో ఏ మార్పు లేదు.



సిబ్బంది ఏర్పాటు చేసిన వాట్సాప్ గ్రూపు

వాట్సాప్ గ్రూప్‌లు ఏర్పాటు చేసుకుని..

గ్రామంలోని రైతులందరినీ ఒక వాట్సాప్ గ్రూప్‌గా ఏర్పాటు చేశారు. ఈ గ్రూపుకు అడ్మిన్‌గా గ్రామ లైన్‌మెన్ గానీ, జూనియర్ లైన్‌మెన్ గానీ కొనసాగుతున్నారు. సబ్‌స్టేషన్‌కు త్రీఫేజ్ సరఫరా ఎప్పుడు వస్తుంది, ఎప్పుడు తిరిగి సింగిల్‌ఫేజ్ ఉంటుందన్న దానిపై లైన్‌మెన్, జూనియర్ లైన్‌మెన్ ఎప్పటికప్పుడు మెసేజ్ రూపంలో సమాచారం ఇవ్వడంతో రైతులు ఆ మెసేజ్‌ను చూసుకుని పొలాల వద్దకు వెళ్తున్నారు. తమ పొలాలు ఎండిపోతున్నాయని రైతులు ఈ మెసేజుల్లోనే తమ ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

నీరు అందడం లేదు



రెండున్నర ఎకరాల్లో వరిసాగు చేశాను. ప్రస్తుతం ఎండలు రోజురోజుకూ ముదురుతున్నాయి. వ్యవసాయానికి విద్యుత్ సరఫరా వేళలు సరిగ్గా లేక చివరి మడికి నీరు చేరడం కష్టంగా ఉంది. ఎప్పుడు వస్తుందో తెలియని పరిస్థితి ఉంది.

– బండారి వెంకటేశ్, రైతు, పెంబట్ల

నిర్ణీత సమయం ప్రకటించాలి



కరెంటు ఎప్పుడు వస్తుందో, ఎప్పుడు పోతుందో తెలియని పరిస్థితి నెలకొంది. దీంతో ఎక్కువ సమయం పొలాల వద్దనే ఉండాల్సి వస్తోంది. రాత్రిపూట ఇచ్చే కరెంటు కోసం పొలాల వద్దకు వెళ్లడం ఇబ్బందిగా ఉంది. నిర్ణీత సమయం వేళలు ప్రకటించాలి.

– జోగు లక్ష్మణ్, రైతు, సారంగాపూర్

మాస్టర్‌ప్లాన్ రద్దుకు ఏకగ్రీవ తీర్మానం

- జగిత్యాల మండల సర్వసభ్య సమావేశం
- మిషన్ భగీరథ నీరు రావడం లేదని సభ్యుల ఆరోపణ

జగిత్యాలరూరల్: జగిత్యాలరూరల్ మండలంలోని తిమ్మాపూర్, నర్సింగాపూర్ గ్రామాలను మాస్టర్ ప్లాన్ నుంచి రద్దు చేయాలని జగిత్యాల మండల సర్వసభ్య సమావేశంలో మంగళవారం ఏకగ్రీవంగా తీర్మానించారు. ఈ మేరకు ఎంపీపీ పాలెపు రాజేంద్రప్రసాద్ అధ్యక్షతన సర్వసభ్య సమావేశం నిర్వహించారు. మిషన్ భగీరథ నీరు సక్రమంగా రావడం లేదని, లీకేజీలను సరిచేయడం లేదని జాబితాపూర్ ఎంపీటీసీ చిత్తారి స్వప్న అన్నారు. తాటిపల్లిలో మిషన్ భగీరథ నీరే రావడం లేదని ఎంపీటీసీ శ్రీనివాస్ అన్నారు. నర్సింగాపూర్ గ్రామ శివారు



ఎంపీడీవోకు తీర్మాన పత్రం ఇస్తున్న సర్పంచులు

లోని డబుల్‌బెడ్రూం ఇళ్లకు మిషన్ భగీరథ నీరు సరఫరా చేయాలని నర్సింగాపూర్ సర్పంచ్ గడ్డం సరోజన అధికారులను కోరారు. మిషన్ భగీరథ డీఈ రామారావు మాట్లాడుతూ కొన్ని గ్రామాల్లో లీకేజీలతో కొంత ఇబ్బందులు అవుతున్నాయని, చాలా గ్రామాలకు మిషన్ భగీరథ నీరు సక్రమంగా అందుతోందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల మేనిఫెస్టోలో రూ.లక్ష రుణమాఫీ చేస్తామని పెట్టి ప్రస్తుత బడ్జెట్‌లో రూ.90వేలు మాఫీ చేస్తామని ప్రభుత్వం ప్రకటించడంతో రైతులు నిరసన వ్యక్తం చేస్తున్నారని కన్నాపూర్ సర్పంచ్ సుధాకర్ అన్నారు. గ్రామాల్లో లంపిస్కిన్ వ్యాధులు వస్తే వైద్యసిబ్బంది పట్టించుకోవడం లేదని జాబితాపూర్ ఎంపీటీసీ చిత్తారి స్వప్న ఆరోపించారు. ప్రతి గ్రామంలో లంపిస్కిన్‌కు వ్యాక్సిన్‌లు ఇచ్చామని డాక్టర్ శ్రీనివాస్ చెప్పారు. గ్రామాల్లో ప్రభుత్వ పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాల వద్ద ఉన్న ప్రభుత్వ స్థలాలకు హద్దులు ఏర్పాటు చేయాలని చెర్లపల్లి సర్పంచ్ తిరుపతి కోరారు. అనంతరం మాస్టర్ ప్లాన్ నుంచి తిమ్మాపూర్, నర్సింగాపూర్ గ్రామాలను రద్దు చేయాలని ఏకగ్రీవంగా మండల సభలో తీర్మానించారు. ఎంపీడీవో రాజేశ్వరి, సూపరింటెండెంట్ గంగాధర్, ఎంపీవో రవిబాబు పాల్గొన్నారు.

మొగిలిపేటలో వేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు

మల్లాపూర్: మండలంలోని మొగిలిపేటలో మంగళవారం శ్రీలక్ష్మీవేంకటేశ్వర ఆలయ వార్షికోత్సవ, జాతర ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. ఈ ఉత్సవాలను 7వ తేదీ నుంచి 9 వరకు నిర్వహించనున్నారు. 9న స్వామి కల్యాణం, జాతర ఘనంగా నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. ఉత్సవాలలో బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు, టీటీడీ బోర్డు సభ్యుడు, ఎమ్మెల్యే కల్వకుంట్ల విద్యాసాగర్‌రావు, జెడ్పీటీసీ సందిరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, ఎంపీపీ కాటిపెల్లి సరోజన–ఆదిరెడ్డి, సర్పంచ్ వనతడుపుల నాగరాజు, ఎంపీటీసీ ఓస సత్తెమ్మ, ఉపసర్పంచ్ సామ రవి, నాయకులు ఓస రాజరెడ్డి, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.



పూజలో పాల్గొన్న ఎమ్మెల్యే విద్యాసాగర్‌రావు

ఘనంగా మల్లన్న జాతర



జాతరలో పాల్గొన్న భక్తులు

మేడిపెల్లి: భీమారం మండలం కమ్మరిపేట్ గ్రామంలో మంగళవారం మల్లన్న జాతర ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా భక్తులు పట్నాలు వేయడంతో పాటు బోనాలు చేసి స్వామివారికి నైవేద్యం సమర్పించారు. ఈ మేరకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో జెడ్పీ వైస్‌చైర్మన్ హరిచరణ్ రావు, ఆది శ్రీనివాస్, ఏనుగు మనోహర్‌రెడ్డి పాల్గొన్నారు.

క్షీరాభిషేకం

బుగ్గారం: బీర్‌సాని గ్రామాన్ని వెల్గటూర్ మండలంలో కలుపుతూ ప్రభుత్వం నిర్ణయం తీసుకోవడంతో మంగళవారం బీర్‌సాని గ్రామస్తులు సంబరాలు జరుపుకున్నారు. ఈ మేరకు సీఎం కేసీఆర్, మంత్రి ఈశ్వర్ చిత్రపటాలకు క్షీరాభిషేకం చేశారు. సర్పంచ్ కారకూరి రాధ, ఉపసర్పంచ్ వేముల సత్తయ్య పాల్గొన్నారు.

బుగ్గారంలోనే కొనసాగించాలి

బుగ్గారం మండలంలోని బీర్‌సాని గ్రామాన్ని వెల్గటూర్‌లో కలపకుండా బుగ్గారంలోనే కొనసాగించాలని బుగ్గారం వీడీసీ నాయకులు తహసీల్దార్ కార్యాలయంలో వినతిపత్రం సమర్పించారు. నాయకులు నక్క చంద్రమౌళి, చుక్క గంగారెడ్డి, నక్క రాజలింగు, కుప్పల శంకర్, రాగన్న, రామన్న, గౌరీశంకర్, సత్యనారాయణ, రాజమల్లు, రఫీక్ పాల్గొన్నారు.

బీర్‌సాని గ్రామంలో సంబరాలు

వెల్గటూర్: బీర్‌సాని గ్రామాన్ని బుగ్గారం మండలం నుంచి వెల్గటూర్ మండలంలో కలపడంపై గ్రామంలో సర్వత్రా హర్షం వ్యక్తం చేశారు. సీఎం కేసీఆర్, మంత్రి కొప్పుల ఈశ్వర్ చిత్రపటాలకు క్షీరాభిషేకం చేశారు.

బోరుబావికి భూమిపూజ



భూమిపూజ చేస్తున్న కౌన్సిలర్ పద్మ

కోరుట్ల: పట్టణంలోని 16వ వార్డులో బోరుబావి ఏర్పాటుకు స్థానిక కౌన్సిలర్ బలిజ పద్మ సోమవారం భూమి పూజచేశారు. అంబేడ్కర్ నగర్‌లో నూతనంగా నిర్మించనున్న లక్ష్మీనర్సింహస్వామి ఆలయ ఆవరణలో తన సొంత ఖర్చులతో బోరు బావి ఏర్పాటు చేస్తున్నట్లు ఆమె తెలిపారు. పసుల గంగనర్సయ్య, పసుల కృష్ణప్రసాద్, చిన్నయ్య, బలిజ రాజరెడ్డి పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

✦14న చలో హైదరాబాద్

కోరుట్ల: ప్రైవేటు రవాణా, ఆటో కార్మికుల సమస్యల పరిష్కారం కోసం ఈనెల 14న హైదరాబాద్‌లోని ఇందిరాపార్క్ వద్ద చేపట్టే ధర్నా పోస్టర్‌ను సోమవారం ఆవిష్కరించారు.

✦పోస్టర్ ఆవిష్కరణ

మేడిపెల్లి: భారతీయ మజ్దూర్ సంఘ అనుబంధ సంస్థ తెలంగాణ బీడి కార్మిక సంస్థ ఆధ్వర్యంలో 14న చలో హైదబాద్‌కు తరలిరావాలని ఆ సంఘ రాష్ట్ర అధ్యక్షుడు సుధీర్ కుమార్ పిలుపునిచ్చారు. ఈ మేరకు మంగళవారం మండల కేంద్రంలో చలో హైదరాబాద్ పోస్టర్ ఆవిష్కరించారు.

✦యువత క్రీడల్లో రాణించాలి

కథలాపూర్: యువత క్రీడల్లో రాణించాలని బీజేపీ కిసాన్‌మోర్చా జిల్లా అధ్యక్షుడు కొడిపెల్లి గోపాల్‌రెడ్డి అన్నారు. ఈ మేరకు మంగళవారం మండలంలోని కలిగోట గ్రామంలో యువకులకు క్రికెట్ బ్యాట్స్ అందజేశారు. నాయకులు కొడిపెల్లి అనిల్, కార్తీక్, మణికంఠ, రవితేజ, సాయి పాల్గొన్నారు.

✦దరఖాస్తులు ఆహ్వానం

కొడిమ్యాల: కొడిమ్యాల మోడల్‌స్కూల్, జూనియర్ కళాశాలలో ఖాళీగా ఉన్న ఉపాధ్యాయ పోస్టులకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ బి.లావణ్య తెలిపారు. ఇందులో పీజీటీ సివిక్స్, పీజీటీ గణితం పోస్టులు ఖాళీగా ఉన్నాయని, సంబంధిత సబ్జెక్ట్‌లలో పీజీ, బీఈడీ పూర్తి చేసిన అభ్యర్థులు అర్హులని తెలిపారు. ఆసక్తి గల అభ్యర్థులు ఈనెల 8, 9వ తేదీల్లో తమ దరఖాస్తులు మోడల్‌లో సమర్పించాలని, 10న డెమో, ఇంటర్వ్యూ నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు.

✦విగ్రహావిష్కరణ విజయవంతం చేయాలి

ఇబ్రహీంపట్నం: మండలంలోని వర్షకొండలో 19న ఛత్రపతి సాహు మహారాజ్ విగ్రహాన్ని బహుజన్ సమాజ్ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ ఆవిష్కరిస్తారని ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరుతూ మంగళవారం వర్షకొండలో పోస్టర్ ఆవిష్కరించారు. పార్టీ కోరుట్ల నియోజకవర్గం ఇన్‌చార్జి గుజ్జెరి ప్రకాశ్, జిల్లా ఇన్‌చార్జి మద్దెల నారాయణ, నాయకులు పాల్గొన్నారు.

✦కబడ్డీ విజేత సంఘమిత్ర యూత్

రాయికల్: పట్టణంలో సంఘమిత్ర యూత్ ఆధ్వర్యంలో భీమన్న జాతర సందర్భంగా మంగళవారం నిర్వహించిన కబడీ పోటీల్లో విన్నర్‌గా సంఘమిత్ర, రన్నర్‌గా అభయ్ టీమ్‌లు నిలిచాయి. విన్నర్‌కు రూ.5 వేలు, రన్నర్‌కు రూ.3వేలు అందజేశారు. సింగిల్‌విండో చైర్మన్ ఏనుగు మల్లారెడ్డి, కౌన్సిలర్ మహేశ్‌గౌడ్, లయన్స్‌క్లబ్ అధ్యక్షుడు దివాకర్‌రెడ్డి, సంఘమిత్ర యూత్ అధ్యక్షుడు శ్రీకాంత్‌రెడ్డి ఉన్నారు.

✦ఉపాధిహామీ పనులు పరిశీలన

రాయికల్: మండలంలోని ఇటిక్యాలలో చేపడుతున్న ఉపాధిహామీ పనులను ఎంపీడీవో సంతోష్‌కుమార్ మంగళవారం పరిశీలించారు.

మిత్రుడి కుటుంబానికి చేయూత



నగదు అందజేస్తున్న పూర్వ విద్యార్థులు

సారంగాపూర్: తమతో కలిసి చదివిన మిత్రుడు అనారోగ్యంతో మృతిచెందాడు. కాగా అతడి కుటుంబానికి పూర్వ విద్యార్థులు అంతా కలిసి అండగా నిలిచారు. 2003–04లో సారంగాపూర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో పదో తరగతి చదివిన మండలంలోని పోతారం గ్రామానికి చెందిన పూసాల రాజేందర్ ఇటీవల అనారోగ్యంతో చనిపోయాడు. రాజేందర్‌తో కలిసిన చదివిన విద్యార్థులు రూ.20వేలు జమ చేసి వారి కుమారుడి పేరున బ్యాంక్‌లో ఫిక్స్‌డ్ డిపాజిట్ చేశారు. ఫిక్స్‌డ్ డిపాజిట్ బాండ్‌ను మృతుడి భార్యకు అందించారు. తూకుంట్ల జలేందర్, గంగాడి శ్రీనివాస్, చిన్ను, రజనీ, సువర్ణ, రజిత పాల్గొన్నారు.

బీఆర్ఎస్‌తోనే గ్రామాల అభివృద్ధి సాధ్యం



శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే రవిశంకర్

కొడిమ్యాల: గ్రామాల అభివృద్ధి బీఆర్ఎస్‌తోనే సాధ్యమని చొప్పదండి ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ అన్నారు. ఈ మేరకు మండలంలోని శనివారంపేటలో నూతనంగా నిర్మిస్తున్న గ్రామపంచాయతీ భవనానికి మంగళవారం ఆయన భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చిన్న చిన్న గ్రామాలను సైతం అభివృద్ధి బాటలు వేసేందుకు సీఎం కేసీఆర్ తక్కువ జనాభా ఉన్న తండాలను గ్రామపంచాయతీలుగా మార్చారని గుర్తు చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ మేనేని స్వర్ణలత, జెడ్పీటీసీ పునుగోటి ప్రశాంతి, సర్పంచ్ బందరు ఎల్లవ్వ, మల్యాల ఏఎంసీ చైర్మన్ నరేందర్‌రెడ్డి, సర్పంచుల ఫోరం మండల అధ్యక్షుడు పునుగోటి కృష్ణారావు, సింగిల్‌విండో చైర్మన్ మేనేని రాజనర్సింగారావు, వైస్ ఎంపీపీ పర్లపెల్లి ప్రసాద్, ఎంపీటీసీ దబ్బులు జగన్మోహన్‌రెడ్డి, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు పులి వెంకటేశ్, ఉపసర్పంచ్ ఐలయ్య పాల్గొన్నారు.

డబుల్‌బెడ్రూం ఇళ్లు నిర్మించి ఇవ్వాలి



వినతిపత్రం ఇస్తున్న నాయకులు

కోరుట్ల: అర్హులైన పేదవాళ్లందరికీ రాష్ట్ర ప్రభుత్వమే డబుల్‌బెడ్రూం ఇళ్లు కట్టించి ఇవ్వాలని సీపీఎం ప్రజాసంఘాల జిల్లా కన్వీనర్ తిరుపతి నాయక్ కోరారు. ఈ మేరకు సోమవారం సీపీఎం ప్రజాసంఘాల ఆధ్వర్యంలో స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల నుంచి మహిళలు ర్యాలీగా వెళ్లి ఆర్డీవో వినోద్‌కుమార్‌కు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా తిరుపతి నాయక్ మాట్లాడుతూ ప్రభుత్వం డబుల్‌బెడ్రూం ఇళ్లు నిర్మించి ఇచ్చేవరకు పోరాటం చేస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో ప్రజా సంఘాల నాయకులు గుమ్మడి రమేశ్, నాగరాణి, లక్ష్మి, లాస్య పాల్గొన్నారు.

ఆదర్శమూర్తి మాతా రమాబాయి అంబేడ్కర్



నివాళి అర్పిస్తున్న నాయకులు

కోరుట్ల: అంబేడ్కర్ సతీమణి మాతా రమాబాయి ఆదర్శమూర్తి అని ఆల్ ఇండియా అంబేడ్కర్ సంఘం నాయకులు అన్నారు. ఈ మేరకు సోమవారం రమాబాయి జయంతి సందర్భంగా పట్టణంలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. అంబేడ్కర్ సంఘం నాయకులు ఉయ్యాల నర్సయ్య, బలిజ రాజరెడ్డి, ఉయ్యాల శోభన్, చిట్యాల కరుణాకర్, నారాయణ, సురేశ్, తిరుపతి నాయక్, దశరథం, శేఖర్, వరుణ్, మురళి పాల్గొన్నారు.

మల్లాపూర్ మండలంలో..

మల్లాపూర్: మండలంలోని సంగెం–శ్రీరాంపూర్‌లో రమాబాయి అంబేడ్కర్ జయంతి సందర్భంగా ఆమె చిత్రపటానికి మంగళవారం నివాళి అర్పించారు. అంబేడ్కర్ యువజన సంఘం మండల ఉపాధ్యక్షుడు జంగం దినేశ్, తెలంగాణ జనసమితి జిల్లా ప్రధాన కార్యదర్శి ఎల్క కమలాకర్, అంబేడ్కర్ యువజన సంఘం నాయకులు అన్వేష్, ఎడ్ల మల్లేశ్, శ్రీనివాస్, రవి, కార్తీక్, ఉదయ్, రాహుల్, జెశ్వంత్, ప్రణయ్, నవకుమార్ పాల్గొన్నారు.

కంటి వెలుగును వినియోగించుకోవాలి



పరీక్ష చేయించుకుంటున్న చైర్మన్ గోలి శ్రీనివాస్

మేడిపెల్లి: ప్రతి ఒక్కరూ కంటి వెలుగు పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఎంపీటీసీ పూర్ణిమ అన్నారు. ఈ మేరకు మంగళవారం బీమారం మండలం గోవిందారం గ్రామంలో కంటి వెలుగు కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఉపసర్పంచ్ రాజు, స్పెషల్ ఆఫీసర్ ప్రవీణ్ చంద్ర, సెక్రటరీ మధుసూదన్, డాక్టర్ మహేశ్ పాల్గొన్నారు.

కంటివెలుగు శిబిరం ప్రారంభం

జగిత్యాలటౌన్: పట్టణంలోని 16వ వార్డులో కంటి వెలుగు శిబిరాన్ని బల్దియా ఇన్‌చార్జి చైర్మన్ గోలి శ్రీనివాస్ మంగళవారం ప్రారంభించారు. కౌన్సిలర్ తోట మల్లికార్జున్, బొడ్ల జగదీశ్, కూసరి అనిల్, నాయకులు బండారి నరేందర్, జగన్‌మోహన్‌రెడ్డి, వాసు పాల్గొన్నారు.

కథలాపూర్ మండలంలో..

కథలాపూర్: మండలంలోని బొమ్మెనలో కంటి వెలుగు కార్యక్రమాన్ని మంగళవారం అధికారులు ప్రారంభించారు. ఎంపీడీవో జనార్దన్, ఎంపీవో గంగాధర్, సర్పంచ్ పిడుగు లావణ్య, సూపర్‌వైజర్ భూషణ్, కంటి వైద్యుడు మైస శ్రీధర్ పాల్గొన్నారు.

వరిసాగులో యాజమాన్య పద్ధతులు పాటించాలి

మల్లాపూర్: వరిసాగులో సమగ్ర యాజమాన్య పద్ధతులు పాటిస్తే మేలు చేకూరుతుందని మండల వ్యవసాయ అధికారి నాగమణి అన్నారు. ఈ మేరకు మంగళవారం మండల కేంద్రంలో రైతులతో కలిసి క్షేత్రస్థాయిలో వరిపంట పొలాలను ఆమె పరిశీలించారు. ఏఈవో గజానంద్, రైతుబంధు కమిటీ కన్వీనర్ డబ్బా రమేశ్‌రెడ్డి పాల్గొన్నారు.

వరిపొలాల పరిశీలన

రాయికల్: మండలంలోని రామారావుపల్లిలో వరిపంట పొలాలను మండల వ్యవసాయాధికారి ముక్తేశ్వర్ మంగళవారం పరిశీలించారు. ఏఈవో రాజేశ్, సర్పంచ్ తిరుమల్ పాల్గొన్నారు.

కథలాపూర్ మండలంలో..

కథలాపూర్: మండలంలోని సిరికొండలో వరిపొలాలను వ్యవసాయశాఖ అధికారులు మంగళవారం పరిశీలించారు. పొలాలను పరిశీలించి నివారణకు వాడే మందుల గురించి వివరించారు. ఏవో యోగితా, ఏఈవో వినీత పాల్గొన్నారు.

విద్యార్థులు అన్నిరంగాల్లో రాణించాలి



విద్యార్థులను సన్మానిస్తున్న లింబాద్రి

ఇబ్రహీంపట్నం: విద్యార్థులు చదువుతో పాటు అన్నిరంగాల్లో రాణించాలని బీఆర్ఎస్ మండల ప్రచార కార్యదర్శి పెంట లింబాద్రి అన్నారు. గత నెల 23న మెట్‌పల్లి డివిజన్ స్థాయిలో నిర్వహించిన సైన్స్ ఎగ్జిబిషన్, టాలెంట్ టెస్ట్ పరీక్షల్లో వేములకుర్తి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థులు రాణి, స్పందన, పాతర్ల హర్షిణి, టాలెంట్ టెస్ట్ పరీక్షలో నేమూరి అనుష్క, బండమీది రచన ప్రతిభ కనబరచగా వీరికి ఆర్డీవో గోల్డ్ మెడల్, ప్రశంసా పత్రాలు ప్రదానం చేశారు. విద్యార్థులను మంగళవారం పాఠశాలలో పెంట లింబాద్రి సన్మానించారు. పాఠశాల హెచ్‌ఎం జంగిలి అశోక్, నాయకులు రమేశ్, దేవదాస్, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ మేనేజర్ రాజరెడ్డి పాల్గొన్నారు.

మహాశివరాత్రి జాతర పోస్టర్ ఆవిష్కరణ

బుగ్గారం: బుగ్గారం గ్రామశివారులోని అటవీప్రాంతంలో గల శ్రీసాంబశివనాగేశ్వర ఆలయంలో మహాశివరాత్రి జాతర సందర్భంగా నిర్వహించే వివిధ ఉత్సవాలకు సంబంధించిన పోస్టర్‌ను మంగళవారం ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఆవిష్కరించారు. 16 నుంచి 19వ తేదీ వరకు వివిధ కార్యక్రమాలు ఉంటాయని తెలిపారు. సాంబశివాలయంలో ప్రతిష్ఠించనున్న ఆంజనేయ స్వామి విగ్రహానికి బుగ్గారం గ్రామానికి చెందిన కల్యాణి పాఠశాల యాజమాన్యం రూ.5వేలు అందించారు.

కార్మికులకు పీపీఈ కిట్లు



కోరుట్ల: పట్టణంలోని మున్సిపల్ కార్మికులకు, వాటర్ సప్లయ్, ఎలక్ట్రికల్ సిబ్బందికి మంగళవారం మున్సిపల్ చైర్మన్ అన్నం లావణ్య పీపీఈ కిట్లు పంపిణీ చేశారు. వైస్ చైర్మన్ గడ్డమీది పవన్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ గజానందం పాల్గొన్నారు.